డైనమిక్
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక
PRGI No: TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు




తెలంగాణ | శనివారం 10-10-2026 | సంపుటి: 01 | సంచిక : 272 | పేజీలు : 12

## రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?: కిషన్ రెడ్డి
ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి.



2

ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా..

## నేను గోకుతూనే ఉంటా!: వెంకట్ బల్మూర్

కేటీఆర్ బాగోతాలను ప్రతీ వారం సీరియల్‌లా బయటపెడతానన్న వెంకట్ బల్మూర్.
ఆయన ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' పంపిస్తున్నట్లు వెల్లడి.
ఓ సినీ నటితో చేసిన చాటింగ్‌ను కేటీఆర్ ఎందుకు డిలీట్ చేశారని ప్రశ్న.



2

## సర్ ప్రక్రియలో భారీ అక్రమాలు

- 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి.
- సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్.
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించారని ఆరోపణ.
- సీఈసీకి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన.

2



## నెలలోగా దరఖాస్తులు క్లియర్

- జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన.
- జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెలలోగా పరిష్కారం.
- సీఎం రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి.
- దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేశామన్న మంత్రి.

2



## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా?

*జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!*
*ట్యాంక్‌బండ్, చెరువులు, పార్కుల వద్ద కేక్ కటింగ్‌లు చేయొద్దని సూచన.*
*ట్యాంక్‌బండ్ ప్రమాదంలో చిన్నారి, ఆమె బంధువు మృతి.*
*రోడ్లపై వేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిక.*
*ఇళ్లలో లేదా సురక్షిత ప్రదేశాల్లోనే పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలని సూచన.*
*ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిషేధించినట్లు తెలిపిన పోలీస్ కమిషనర్.*

2



## మలుపులు తిరుగుతున్న తెలంగాణ రాజకీయం

- రేవంత్‌ను లక్ష్యంగా చేసుకుని కేటీఆర్ బహిరంగ లేఖలు.
- రాహుల్ గాంధీ మౌనమే బీఆర్ఎస్ ప్రధాన అస్త్రం.
- జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టడమే వ్యూహమా

2




## రేవంత్ రెడ్డి ఫ్యామిలీ అనకొండ ఫ్యామిలీ!

- సీఎం రేవంత్‌పై మన్నె క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు.
- 817 ఎకరాల భూముల తనఖాపై ప్రశ్నలు.
- తెలంగాణ సంపదను కాపాడేందుకే పోరాటం: క్రిశాంక్.




**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు, ప్రభుత్వ భూముల తనఖా వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు చేశారు. అక్రమ ఆస్తులపై తాము ప్రశ్నలు లేవనెత్తుతున్నా ముఖ్యమంత్రి నుంచి సమాధానం- **మిగతా 2 లో...**

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై

## చంద్రబాబు స్పందన

స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లపై ఏపీ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత.
50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటరాదన్న హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు.
కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా బీసీలకు అండగా ఉంటామన్న చంద్రబాబు.



2

## దసరా పండుగ సందడి.

కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్.
దసరా సెలవులతో హైదరాబాద్ బస్టాండ్లలో పెరిగిన ప్రయాణికుల రద్దీ.



2

రాష్ట్రవ్యాప్తంగా 7,000 ప్రత్యేక బస్సులను నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ.
ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలపై 50 శాతం అదనం.
మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం యథాతథం.
ప్రయాణికుల కోసం ప్రధాన టెర్మినళ్లలో అదనపు సౌకర్యాల ఏర్పాటు.

దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM PRGI NO:TGTEL/26/A0383

# సర్ ప్రక్రియలో భారీ అక్రమాలు

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. SIR ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు. మరోవైపు, హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

# మలుపులు తిరుగుతున్న తెలంగాణ రాజకీయం

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**

తెలంగాణ రాజకీయాలు రోజురోజుకూ ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాలు, వ్యాఖ్యలు, బీఆర్ఎస్ నాయకులు, సామాజిక మాధ్యమ కార్యకర్తలపై నమోదవుతున్న కేసుల నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి వరుసగా బహిరంగ లేఖలు రాస్తుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రేవంత్‌రెడ్డి వైఖరిని నియంత్రించాలని రాహుల్ గాంధీని కోరుతూ కేటీఆర్ చేస్తున్న విమర్శలు రాష్ట్ర రాజకీయాలను జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**రాహుల్ నైతికతపై ప్రశ్నలు.**

దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు, వ్యక్తి స్వేచ్ఛ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ తెలంగాణలో ప్రతిపక్ష నేతలు, బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు నమోదవుతున్నాయని వస్తున్న ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నను కేటీఆర్ ముందుకు తెస్తున్నారు. ఈ లేఖల ద్వారా రాహుల్ గాంధీని ఇరుకున పెట్టడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రకటించే సిద్ధాంతాలకు, రాష్ట్రంలో ప్రభుత్వ వ్యవహారశైలికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది.

**జాతీయ స్థాయిలో చర్చకు యత్నం.**

రాహుల్ గాంధీని నేరుగా సామాజిక మాధ్యమ వేదికలపై ప్రస్తావిస్తూ లేఖలు రాయడం ద్వారా తెలంగాణ రాజకీయ పరిణామాలను జాతీయ మీడియా దృష్టికి తీసుకెళ్లవచ్చని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలకు జాతీయ స్థాయిలో ప్రచారం లభిస్తే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని ఆ పార్టీ నాయకులు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.




**కాంగ్రెస్ నుంచి ఎదురుదాడి.**

మరోవైపు కేటీఆర్ లేఖలపై కాంగ్రెస్ వర్గాలు భిన్నంగా స్పందిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై రాజకీయ ప్రత్యర్థులు చేసే ఫిర్యాదుల ఆధారంగా కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని అధికార పార్టీ నేతలు పేర్కొంటున్నారు. కేటీఆర్ విమర్శలు రాజకీయ ప్రచారం, సామాజిక మాధ్యమాల్లో దృష్టి ఆకర్షించేందుకేనని కాంగ్రెస్ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి.

**రాజకీయ వ్యూహంలో భాగమేనా?**

కేటీఆర్ బహిరంగ లేఖలు రేవంత్‌రెడ్డి పదవికి ముప్పు కలిగించడానికంటే, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వాన్ని నైతిక ప్రశ్నలతో ఇరుకున పెట్టే ప్రయత్నమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలను ప్రస్తావనలోకి తీసుకురావడం ద్వారా రాజకీయ ఒత్తిడి పెంచాలన్న వ్యూహం కూడా ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ లేఖలు కాంగ్రెస్ అధిష్ఠానం వైఖరిపై ఎలాంటి ప్రభావం చూపుతాయి? తెలంగాణ రాజకీయాలను జాతీయ స్థాయిలో ఎంతవరకు ప్రభావితం చేస్తాయి? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

# రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**



కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

# అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా?

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**

అర్ధరాత్రి వేళ రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌తో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు చేయొద్దని స్పష్టం చేశారు. సరదా కోసం చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె బంధువు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి పుట్టినరోజు వేడుకల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు



కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని సజ్జనార్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌లో ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని, సంబంధిత ప్రభుత్వ శాఖలతోనూ సమీక్ష నిర్వహించామని వెల్లడించారు. అర్ధరాత్రి వేళ రోడ్లపై పాదచారుల రాకపోకలు తక్కువగా ఉండటంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయని సజ్జనార్ హెచ్చరించారు. అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటబెట్టుకుని రోడ్ల మధ్యకు రావడం ప్రమాదకరమన్నారు. పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య ఇంట్లో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిర్వహించడంపై ఇప్పటికే జీహెచ్ఎంసీ నిషేధాజ్ఞలు ఉన్నాయని గుర్తుచేశారు. పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ, వేడుకల కోసం అక్కడికి వచ్చే వారిని వెనక్కి పంపిస్తున్నా, మళ్లీ అర్ధరాత్రి వేడుకలకు వస్తుండటంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. క్షణకాలపు ఆనందం కోసం విలువైన ప్రాణాలను కోల్పోవద్దని, ఇకపై ట్యాంక్‌బండ్, చెరువులు, బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వేడుకలు నిర్వహించవద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

# ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా. నేను గోకుతూనే ఉంటా!: వెంకట్ బల్మూర్

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యవహారశైలిపై సంచలన ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై ప్రతీ వారం ఒక సీరియల్ లాగా ఆయన బాగోతాలను బయటపెడతానని హెచ్చరించారు. "ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా, నేను గోకుతూనే ఉంటా" అని వ్యాఖ్యానించిన బల్మూర్, కేటీఆర్ ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' (ఇచ్ గార్డ్) పంపిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకట్ బల్మూర్ మాట్లాడుతూ.. తాము కేటీఆర్ బాగోతాలు బయటపెడితే, బీఆర్ఎస్ నేతలు తమ ముఖ్యమంత్రిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. 2019 నుంచి 2022 మధ్య ఓ సినీ నటితో జరిపిన సోషల్ మీడియా సంభాషణలను కేటీఆర్ ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ హోటల్ వ్యాపార రహస్యాలు ప్రజల ముందు ఉంచాలన్నారు. "2015లో రూ. 5 కోట్లుగా ఉన్న డెక్కన్ సెరాయ్ హోటల్ షేర్ విలువ, పదేళ్లలో రూ. 175 కోట్లకు ఎలా పెరిగింది? ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరతాం" అని స్పష్టం చేశారు. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పే కేటీఆర్, పాస్‌పోర్ట్ సీజ్ చేయాలన్న పోలీసుల అభ్యర్థనపై కోర్టును ఎందుకు ఆశ్రయించారని బల్మూర్ ప్రశ్నించారు. కేటీఆర్ చెప్పేవి నీతి మాటలని, చేసేవి అవినీతి పనులని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తుంటే, కేటీఆర్ డ్రగ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. తాను చెప్పేవన్నీ అబద్ధాలైతే కేటీఆర్ లైవ్‌లోకి వచ్చి వాస్తవాలు చెప్పాలని, డ్రగ్ టెస్టుకు సిద్ధమని ప్రకటించాలని సవాల్ విసిరారు. ప్రస్తుతం కేసీఆర్ కూడా కేటీఆర్‌తో మాట్లాడటం లేదని, తండ్రీకొడుకుల మధ్య పంచాయతీని నవీన్ రావు తండ్రి కొండల్ రావు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని బల్మూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఎందుకు ఎవరితో కలవడం లేదో బీఆర్ఎస్ మిత్రులు కూడా ఆలోచించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా, ఫాంహౌస్ లో కేటీఆర్ కు రహస్య ట్రీట్ మెంట్ అంటూ సంచలన ట్వీట్లు కూడా చేశారు.

# రేవంత్ రెడ్డి ఫ్యామిలీ అనకొండ ఫ్యామిలీ!

- మొదటి పేజీ తరువాయి..

రావడం లేదని విమర్శించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అనుముల కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని 'అనుముల ఫ్యామిలీ.. అనకొండ ఫ్యామిలీ' అంటూ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ పరిసరాల్లోని 817 ఎకరాల భూములను తనఖా పెట్టి రూ. 12,818 కోట్లకు పైగా రుణం తీసుకున్నారంటూ క్రిశాంక్ ఆరోపించారు. ఆయా భూముల మార్కెట్ విలువను తక్కువగా చూపించారని, వాస్తవ విలువకు, రుణం కోసం చూపిన విలువకు భారీ వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. ఇజ్జత్‌నగర్, మొకిల, మియాపూర్, ఇంజాపూర్, చిలుకూరు, పటాన్‌చెరు, గాజులరామారం, జవహర్‌నగర్ ప్రాంతాల్లోని భూముల తనఖా వ్యవహారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జవహర్‌నగర్‌లో గతంలో జెన్‌పాక్ట్ సంస్థకు కేటాయించిన భూమిలో ప్రస్తుతం కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు సంబంధించిన కంటైనర్లు ఎలా ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. భూముల తనఖా, వాటి విలువ, సంబంధిత సంస్థల మధ్య లావాదేవీలపై సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. తాము వ్యక్తిగత ఆస్తుల గురించి కాకుండా తెలంగాణ సంపద పరిరక్షణ గురించే ప్రశ్నిస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు తనపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేస్తున్నా వెనక్కి తగ్గేది లేదని క్రిశాంక్ అన్నారు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ఎదురుదాడికి దిగడం, బెదిరింపులకు పాల్పడటం, కేసులు నమోదు చేయడం సరికాదని విమర్శించారు. గతంలో రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు రూ. 52 వేల కోట్ల అక్రమ ఆస్తులు ఉన్నాయని ఆరోపించామని, తాజాగా భూముల తనఖా వ్యవహారంతో మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ఆస్తులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలపై




ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. అయితే, ఆయన చేసిన ఆరోపణలపై సంబంధిత ప్రభుత్వం, సంస్థల వివరణ అందుబాటులో లేనందున వాటిని ఆరోపణలుగానే పరిగణించాలి.

# నెలలోగా దరఖాస్తులు క్లియర్

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**



తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు. ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని పొంగులేటి వెల్లడించారు. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఏ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని... 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొంది 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన

**జనం వాయిస్,ఆంధ్రప్రదేశ్, అక్టోబర్ 9:**



స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదంటూ గతంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం కోటా 50 శాతం మించకూడదన్న నిబంధనను హైకోర్టు గుర్తుచేయడం సమంజసమేనని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. న్యాయస్థానాల తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం బీసీలకు పూర్తిస్థాయిలో రాజకీయంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ తరఫున అధిక శాతం సీట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కడాన్ని వైసీపీ సహించలేకపోయిందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కోర్టులకు వెళ్లి, బీసీల రాజకీయ వాటాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల కోటాను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు సుమారు 16,800 పదవులు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.

# దసరా పండుగ సందడి.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**

దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్‌ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక
జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

## సాయి రిషి విద్యాలయ మాతృ మందిర్‌లో ముందస్తు

# బతుకమ్మ సంబరాలు.

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన చిన్నారులు.





**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 9:**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలోని సాయి రిషి విద్యాలయ మాతృ మందిర్‌లో ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు పరిచయం చేయడంతో పాటు పండుగల విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ ఆటలతో సందడి చేశారు. పూల పరిమళాలు, పాటల సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ పల్లెల్లో తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతితో మానవ సంబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. చిన్నతనం నుంచే విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎన్. సంధ్యారాణి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్. లక్ష్మీ ప్రసన్నతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అందరూ కలిసి బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఉపాధి గణాంకాల సేకరణకు

# ప్రజలు సహకరించాలి.

- రామగుండంలో కార్మిక శక్తి సర్వే.
- వివరాలు గోప్యంగా ఉంచుతాం.
- గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్.





**జనం వాయిస్, రామగుండం, అక్టోబర్ 9:**

దేశంలో ఉపాధి, నిరుద్యోగ పరిస్థితులను అంచనా వేసేందుకు జాతీయ గణాంక కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆవర్తిత కార్మిక శక్తి సర్వే--2026కు ప్రజలు సహకరించాలని గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ కోరారు. రామగుండం పట్టణంలో నిర్వహిస్తున్న ఈ సర్వే ద్వారా ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ ని కలిసి సర్వే కరపత్రాలను అందజేసి, సర్వే లక్ష్యాలు, ప్రాధాన్యతను వివరించారు. ఎంపిక చేసిన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా సందర్శించి, ఆధునిక సమాచార పరికరాల ద్వారా వివరాలను సేకరిస్తామని పేర్కొన్నారు. సర్వేలో సేకరించిన వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. దేశంలో ఉపాధి పరిస్థితులను అంచనా వేయడానికి, విధానాల రూపకల్పనకు విశ్వసనీయ గణాంకాలు ఎంతో అవసరమని తెలిపారు. సర్వే సిబ్బందికి కుటుంబాలు సరైన సమాచారం అందించి కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొడిగె స్వప్న ప్రియ భరత్ గౌడ్, వార్డు అధికారి రాజేష్, సహాయ వార్డు అధికారి మహేష్, మెప్మా సిబ్బంది ఆర్పీ ధనలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు మన సంస్కృతికి వారధులు.

### రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య.

**జనం వాయిస్, పెద్దపల్లి , అక్టోబర్ 9:**

పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, తరతరాల మధ్య అనుబంధాలను పెంచే వారధులని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు. శుక్రవారం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో పాఠశాలకు చేరుకున్నారు. బతుకమ్మ పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, కోలాటాలతో సందడి చేశారు. బాలురు సైతం వివిధ పాటలకు నృత్యాలు చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయినులు కూడా విద్యార్థులతో కలిసి బతుకమ్మ పాటలకు నృత్యాలు చేయడంతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం నిర్దేశించిన విధంగా ప్రతి ఒక్కరూ అన్ని మతాలు, కులాలను సమానంగా గౌరవించాలని, మనిషికి మానవత్వమే ముఖ్యమని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యతను పెంపొందించడంలో పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజాధనంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, శాస్త్రీయమైన, నాణ్యమైన ఉచిత విద్యను గ్రామీణ ప్రాంతాల పిల్లలకు అందిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృత, సురేష్ కుమార్, మంద శ్రీవాణి, ఎడ్ల స్రవంతి, బండారి సరిత, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, పలువురు పాల్గొన్నారు.




## వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనంతుల రాజుకు ఘన సన్మానం




**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 9:**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన అనంతుల రాజును రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, నగర మేయర్ మహంకాళి స్వామి ఘనంగా సన్మానించారు. శుక్రవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానికంగా సేవలందిస్తున్న అనంతుల రాజును రాష్ట్ర నాయకత్వం గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించడం అభినందనీయమన్నారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, 50వ డివిజన్ కార్పొరేటర్ దూళికట్ట సతీష్, 52వ డివిజన్ కార్పొరేటర్ చిదురాల నాగరాజు, మూడో వార్డు కార్పొరేటర్ వడ్లూరి రవి, గోదావరిఖని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణిశెట్టి నటరాజశేఖర్, ముఖ్య సలహాదారు అల్లంకి లచ్చయ్య, పెద్దపల్లి డివిజన్ చైర్మన్ యాద వెంకటరమణ, రాముడు, తాటిపల్లి దేవయ్య, వెంకట ముత్యం, వేణిశెట్టి వీరన్న, చంద సంతోష్, ముస్త్యాల సంతోష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి మేకల అజయ్, పూజారి రాకేష్, బొల్లం రాజు, సాధుల రాజేష్, చిరుకొండ అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి మిస్టర్

# ఇండియా అవార్డు

### ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ చేతుల మీదుగా పురస్కారం

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 9:**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి మిస్టర్ ఇండియా అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మేకప్ తెలంగాణ సంస్థ దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి వంటి ప్రతిభావంతులు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతూ గుర్తింపు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ, తన ప్రతిభను గుర్తించి పురస్కారం అందించిన మేకప్ తెలంగాణ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మిస్టర్ ఇండియా అవార్డు రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఇప్పటివరకు తనకు మొత్తం 86 అవార్డులు లభించాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర చారి, సురేందర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, మధుసూదన్, మీర్ జుల్ఫికర్ అలీ, జక్కుల లక్ష్మణ్‌తో పాటు డాక్టర్ దివ్యమూర్తి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల

# స్థలాల కోసం కృషి చేస్తాం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు భరోసా

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 9:**

సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం ప్రభుత్వ పరంగా చిత్తశుద్ధితో కృషి చేస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలోని డాక్టర్ విజయ ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ చిరకాల సమస్యగా ఉన్న ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు అంశంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి సమష్టి కృషి అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యూనియన్లు, సంఘాలకు అతీతంగా సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఐదుగురు సభ్యులతో సమన్వయ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కమిటీ ముందుకు వస్తే సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పెద్దపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల లభ్యత కొంత క్లిష్టంగా ఉన్నప్పటికీ, అనువైన స్థలాల గుర్తింపు కోసం అధికారులు అన్వేషిస్తున్నారని వివరించారు. సుల్తానాబాద్, ఓదెల మండలాల పరిధిలోనూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించాలని సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా అనువైన ప్రభుత్వ స్థలాలు ఉంటే వాటి సర్వే నంబర్లతో తన దృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులను కోరారు. అధికారులు, జర్నలిస్టులు సమన్వయంతో పనిచేస్తే అర్హులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని విజయరమణారావు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, వివిధ మండలాలకు చెందిన పాత్రికేయులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి!

### పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి.
### కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం.

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 9:**

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కొత్తగా మంజూరైన ఇళ్లకు సంబంధించిన మంజూరు పత్రాల పంపిణీని త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. మొదటి జాబితాలో మంజూరైన ఇళ్లలో ఆశించిన స్థాయిలో పురోగతి లేని వాటిని గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించని ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి, పనులు మొదలుపెట్టకపోవడానికి గల కారణాలను తెలుసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొదటి జాబితాలో ఇప్పటికీ ఇంటి స్థలాల మార్కింగ్ పూర్తికాని ఇళ్లను గుర్తించి, వెంటనే మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మార్కింగ్ పూర్తయిన ఇళ్లలో నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణం ఏయే దశల్లో ఉందో ఎప్పటికప్పుడు వివరాలు సేకరించి, ప్రతి ఇంటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పథకాన్ని అమలు చేస్తూ, లబ్ధిదారులకు అవసరమైన మార్గదర్శకాలు అందించి ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో హౌసింగ్ పీడీ పవన్ కుమార్, డిప్యూటీ ఈఈ దస్తగిరి, సహాయ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



PRGI NO:TGTEL/26/A0383
జనం వాయిస్
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

## దసరా ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి!

- అధికారులకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశం.
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు.

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 9:**

గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ సింగరేణి స్టేడియం మైదానంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దసరా ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలపై చర్చించారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. స్టేడియం పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, వాహనాల రాకపోకల నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. సింగరేణి, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొని సంతోషంగా పండుగ జరుపుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జల్ద అరుణశ్రీ, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేన రెడ్డితో పాటు సింగరేణి, మున్సిపల్ శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.



## సమాచార హక్కు దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు!

పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి.
అధికారులకు అదనపు కలెక్టర్ శ్రీరాములు ఆదేశం.

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 9:**

సమాచార హక్కు చట్టం కింద అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తామని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు హెచ్చరించారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు ప్రజలకు చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. శుక్రవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమాచార హక్కు వారోత్సవాలు--2026 సందర్భంగా పౌర సమాచార అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిల్లో సంబంధిత శాఖల



అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమాచార హక్కు చట్టం కింద పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తమకు నిర్దేశించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో తెలుసుకొని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. చట్ట నిబంధనల ప్రకారం ప్రజలకు అందించాల్సిన సమాచారాన్ని పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పాలనపై




మరింత అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. అధికారుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమాచార హక్కు దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోయినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు ఈశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి శారద, జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ కుమార్ నాయుడు, జిల్లా బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలకు చెందిన అధికారి ఎం. రవీందర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు కరెంటు, నీళ్లివ్వకుంటే సబ్‌స్టేషన్ల ముట్టడి!

**మంత్రి శ్రీధర్‌బాబు ఫొటోలకే పరిమితం.. రైతుల కష్టాలు పట్టవా? మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.**

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 9:**

వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే విద్యుత్ ఉపకేంద్రాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. మంథని ప్రాంతంలో అప్రకటిత విద్యుత్ కోతలు, ఎస్సారెస్పీ నీటి విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం రైతులతో కలిసి మంథని--కాటారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పాత పెట్రోల్ బంకు సమీపంలో సుమారు గంటపాటు సాగిన ఆందోళనతో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. వరి పంట పొట్టదశకు చేరుకున్న సమయంలో విద్యుత్ సరఫరా లేక బోర్లు పనిచేయక, నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల




సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల పంటలు ఎండిపోతుంటే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మరో మంత్రితో ఫొటోలు దిగుతూ కాలయాపన చేస్తున్నారని పుట్ట మధూకర్ ఆరోపించారు. తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేసి విద్యుత్, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీపైనే దృష్టి సారించిందని విమర్శించారు. రైతుల తరఫున పోరాడితే కేసులు పెట్టినా, నిర్బంధాలు



విధించినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. పంటలను కాపాడకపోతే రైతులు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి, ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని పుట్ట మధూకర్ స్పష్టం చేశారు.

## దుర్గమ్మ ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి

- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 9:**

గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి, స్టేషన్ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించి, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని, ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న దుర్గమ్మ ఉత్సవాలు, ఊరేగింపుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం డీజేలకు అనుమతి లేదనే విషయాన్ని నిర్వాహకులకు ముందుగానే తెలియజేయాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓపెన్‌కాస్ట్ గనులు, సింగరేణి బొగ్గు గనులు, పారిశ్రామిక సంస్థల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత భద్రతా సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు.




## బతుకమ్మ సంబరాలకు సర్పంచ్ చొరవ.. స్థలం సిద్ధం

**జనం వాయిస్,శాయంపేట,అక్టోబరు 9:**

సద్దుల బతుకమ్మ వేడుకలకు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ చింతల ఉమా-రవిపాలు, ఉప సర్పంచ్ దైనంపల్లి సుమన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శాయంపేట మండల కేంద్రంలోని తాళ్లకుంట సమీపంలో శుక్రవారం ట్రాక్టర్ సాయంతో గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించి స్థలాన్ని శుభ్రం చేయించారు. బతుకమ్మలు పేర్చేందుకు, మహిళలు సంప్రదాయ ఆటపాటలతో పండుగను ఆనందంగా జరుపుకునేందుకు వీలుగా పరిసరాలను సిద్ధం చేయించారు. పండుగకు వచ్చే మహిళలకు ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఈ పనుల్లో వార్డు సభ్యులు కొత్తపల్లి రవీందర్, తట్ల ప్రవళిక-సాయి సహకరించారు.



## తెలంగాణ సంస్కృతిని చాటిన బతుకమ్మ సంబరాలు

- సంప్రదాయాలను భావితరాలకు అందించాలి.
- ప్రిన్సిపాల్ మంజుల.

**జనం వాయిస్, పరకాల, అక్టోబరు 9:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల సూచించారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, 'బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ తెలంగాణ పండుగల విశిష్టతను భావితరాలకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎండీ సర్దార్, ఏజీఎంసీ మైపాల్‌రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ కృష్ణమోహన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## మృతుల కుటుంబాలకు పుట్ట మధూకర్ పరామర్శ

**జనం వాయిస్, ముత్తారం, అక్టోబర్ 9:**

ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు నాంసాని సమ్మయ్య సోదరి పెంచాల సరోజన ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను పుట్ట మధూకర్ పరామర్శించారు. అలాగే ఇటీవల మృతి చెందిన మండల రాజమ్మ, కలవేన మొగిలి కుటుంబాలను కలిసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ముత్తారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాట్ల పోషాలు, బండ సత్తమ్మ, తూముల కొమురెల్లి, పరికిపండ్ల రాజలింగు కుటుంబాలను పరామర్శించి, మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేయాలి

- బహుజన రాజ్యాధికారమే లక్ష్యం.
- మారపెల్లి క్రాంతి కుమార్.

**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 9:**

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా కాన్షీరాం చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మారపెల్లి క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం శాయంపేట మండల కేంద్రంలో కాన్షీరాం 20వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉండి కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేయాలని క్రాంతి కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, జిల్లా కార్యదర్శి మారపెల్లి విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు మారెపల్లి సుధాకర్, రాజేష్, నాలికె రవీందర్, రాజు పాల్గొన్నారు.



## మానసిక ఆరోగ్యమే.. ఆనందానికి పునాది

మానసిక సమస్యలపై అపోహలు వీడాలి.
నిపుణుల సాయం తీసుకోవాలి.
తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగు అశోక్.

**జనం వాయిస్,శాయంపేట,అక్టోబరు 10:**



మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగు అశోక్ హెచ్చరించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళనలను బలహీనతగా చూడటం మానుకోవాలని స్పష్టం చేశారు. బాధలను దాచుకోవడం పరిష్కారం కాదని, అవసరమైనప్పుడు మానసిక నిపుణులను సంప్రదించాలని పేర్కొన్నారు. సమస్యలతో బాధపడేవారు 9391117100, 9440890073 నంబర్లను సంప్రదించి సలహాలు పొందవచ్చన్నారు. మానసిక ఆరోగ్యంపై వివక్షను విడనాడి, బాధలో ఉన్నవారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

PRGI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# పన్ను రసీదులున్నా అండలేని అభాగ్యుడు

- కురవిలో ఎరుకల కార్మికుడి గుడిసె కూల్చివేత యత్నం!
- ఏకలవ్య వారసుడి ఆక్రందన.
- సంఘాల మౌనం వెనుక అంతర్యమేమిటి?
- ఆర్థిక, రాజకీయ బలంలేని వారిని వదిలేస్తారా..?
- "ఎరుకుల సంఘం" నాయకులు ఏమైనట్లు? వారి గొంతు ఎందుకు మూగబోయింది?
- ఉన్న గుడిసెను కూడా కాపాడుకోలేని దుస్థితి.. ఇదేనా సామాజిక న్యాయం!?

**కురవి, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**

అధికారాలు మారుతున్నాయి.., వ్యవస్థలు మారుతున్నాయి.., కానీ పేదవాడి బ్రతుకు చిత్రం మాత్రం మారడం లేదు. "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా, సమాజంలో అట్టడుగున ఉన్న దళిత, గిరిజన పేదల జీవితాలు ఇంకా చీకట్లోనే మగ్గుతున్నాయి. "చిలుకమ్మా పలుకవే పలుకు" అంటూ కాలజ్ఞానంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పినట్లు, సమాజంలో నైతిక విలువలు పతనమైపోతున్న తరుణంలోనైనా పాలకులు కళ్లు తెరవాలి.

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన ఎరుకల నిమ్మశెట్టి వెంకన్న ఉదంతం నేటి ఆధునిక సమాజంలో పేదవాడికి ఎదురవుతున్న అభద్రతకు, వ్యవస్థల నిర్లిప్తతకు ఒక నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. గత 50 ఏళ్లుగా వారసత్వంగా వస్తున్న పూరి గుడిసెలో నివాసముంటూ, కుల వృత్తి అయిన బుట్టల తయారీనే నమ్ముకుని, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో వెంకన్న కుటుంబం జీవనం సాగిస్తోంది.

**'బాధితుడి ఆక్రందన' ప్రత్యేక కథనం**



### ధన మదం ముందు తలవంచుతున్న మానవత్వం

కాలానుగుణంగా మనుషుల్లో స్వార్థం పెరిగిపోయి, ధన మదంతో పేదోడిని హీనంగా చూసే రోజులు వచ్చాయనడానికి ఈ ఘటనే సాక్ష్యం. తరతరాలుగా ఉంటున్న ఆ పేద కార్మికుడి గుడిసెను, కొంతమంది స్వార్థపరులు తమ సొంత ప్రయోజనాల కోసం కూల్చడానికి ప్రయత్నించడం దుర్మార్గం. సమాజంలో డబ్బున్న వాడికే స్థానమా? పేదవాడి సొంతింటి కల మాట దేవుడెరుగు... ఉన్న గుడిసెను కూడా కాపాడుకోలేని దీనస్థితిలోకి నెట్టేయడం ఏ సామాజిక న్యాయం కిందికి వస్తుంది?

### "ప్రభుత్వ ఆధారాలున్నా.. రక్షణ ఏది?" - బాధితుడి ఆక్రందన

ఈ విషయమై బాధితుడు నిమ్మశెట్టి వెంకన్న కన్నీరుమున్నీరవుతూ తన ఆవేదనను వ్యక్తం చేశాడు. "మా తండ్రి కాలం నుండి గత 50 ఏళ్లుగా మేము ఇదే స్థలంలో నివాసం ఉంటున్నాము. కురవి మేజర్ గ్రామ పంచాయతీ నుండి మాకు ఇంటిపన్ను రసీదు ఉంది. క్రమం తప్పకుండా కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం అందించిన మిషన్ భగీరథ నీటి పైపులైన్ కనెక్షన్ కూడా మా ఇంట్లో ఉంది. ఇన్ని ప్రభుత్వ ఆధారాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, కొంతమంది స్వార్థపరులు కావాలనే కక్షగట్టి ఈ స్థలం మాదంటూ మా పూరి గుడిసెను ధ్వంసం చేయడానికి.. ఎలాగైనా మా ఇంటి స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. మాకు ఆర్థిక, రాజకీయ.., ఏ అండలేదు.., ప్రజా సంఘాల ప్రతినిధులు, అధికారులు స్పందించి న్యాయ విచారణ జరిపించాలి. నా కుటుంబాన్ని రోడ్డున పడకుండా ఆదుకోవాలి" అని బాధితుడు కన్నీటితో వేడుకుంటున్నాడు.

### నాయకుల 'మౌనం' వెనుక అంతర్యమేమిటి?

ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తామని, పేదలకు అండగా ఉంటామని గొంతు చించుకునే రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు ఈ ఎరుకల కుల కార్మికుడికి కష్టం వస్తే ఎందుకు నోరు మెదపడం లేదు? ఎన్నికల వేళ ఓట్ల కోసం పేదల గుమ్మాలెక్కే నాయకులకు, ఇప్పుడు వెంకన్న ఆక్రందన ఎందుకు వినపడటం లేదు? ఈ మౌనం వెనుక ఉన్న అంతర్యమేమిటి? కార్పొరేట్ శక్తులకు, స్వార్థపరులకు లొంగిపోయి పేదవాడిని రోడ్డున పడేస్తుంటే చూస్తూ ఊరుకోవడం నాయకత్వ లక్షణమా?

### ఏకలవ్య వారసులకు ఎటువైపో ఈ పయనం?

మహాభారతంలో గురువు ప్రత్యక్షంగా విద్య నేర్పకపోయినా, గురుభక్తితో శ్రద్ధగా విద్యను అభ్యసించి ఆదర్శంగా నిలిచిన పరమ భక్తుడు ఏకలవ్యుడు. ఆ ఏకలవ్యుడిని తమ ఆరాధ్య దైవంగా పూజించే ఎరుకల కుల బాంధవుల ఆత్మగౌరవం నేడు ప్రశ్నార్థకంగా మారింది. సమాజంలో తమ హక్కుల కోసం, కులస్థుల సంక్షేమం కోసం ఏర్పాటైన "ఎరుకల సంఘం" నాయకులు సైతం ఈ విషయంలో మౌనంగా ఉండిపోవడం విచారకరం. తమ సొంతకులానికి చెందిన ఒక నిరుపేద కుటుంబం సర్వస్వం కోల్పోయే స్థితికి వస్తే, ఆదుకోవాల్సిన సంఘం నాయకులు ఏమైనట్లు? వారి గొంతు ఎందుకు మూగబోయింది?

### న్యాయ విచారణే శరణ్యం

"చిలుకమ్మా పలుకవే పలుకు" అంటూ కాలజ్ఞానంలో వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పినట్లు, సమాజంలో నైతిక విలువలు పతనమైపోతున్న తరుణంలోనైనా పాలకులు కళ్లు తెరవాలి. ఈ ఘటనపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర న్యాయ విచారణ జరపాలి. 50 ఏళ్లుగా కులవృత్తినే నమ్ముకుని, పంచాయతీ పన్నులు కడుతూ జీవిస్తున్న వెంకన్న కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలి. వారి గుడిసెను కూల్చి ఆక్రమణకు పాల్పడుతున్న స్వార్థపరులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వ్యవస్థలు పేదవాడికి చుట్టం కావాలి కానీ, ధనవంతులకు దాసోహం కాకూడదు. అప్పుడే ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి నిజమైన అర్థం లభిస్తుంది.

# ఆయిల్ ఫామ్ గెలల కొనుగోలులో రైతులకు అన్యాయం!

- తరుగు పేరుతో రూ.32 లక్షల నష్టం.. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి.
- కొనుగోలు కేంద్రాలు పెంచాలి.. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి.

**కురవి, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**

ఆయిల్ ఫామ్ గెలల కొనుగోలులో తరుగు పేరుతో రైతులకు జరిగిన నష్టాన్ని వెంటనే భర్తీ చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి ఆయిల్‌ఫెడ్ అధికారులను డిమాండ్ చేశారు. కురవి మండలం కందికొండలోని ఆయిల్ ఫామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మహబూబాబాద్



జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్నప్పటికీ, గెలల కొనుగోలులో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సుధాకర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో తొర్రూరు, కందికొండ, కేసముద్రం కేంద్రాల్లో గెలల కొనుగోళ్లు జరుగుతుండగా, మూడు కేంద్రాలకు ఒకే కాంట్రాక్టర్ ఉండటంతో సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. గెలలు పచ్చిగా ఉన్నాయనే కారణంతో తరుగు పేరుతో ఒక్కో టన్నుకు 10 కిలోల చొప్పున కోత విధిస్తున్నారని, ఈ విధానం వల్ల ఇప్పటివరకు రైతులు దాదాపు రూ.32 లక్షలు నష్టపోయారని ఆయన తెలిపారు. ఈ వ్యవహారంపై ఆయిల్‌ఫెడ్ అధికారులు విచారణ కొనసాగిస్తున్న నేపథ్యంలో, దానిని త్వరితగతిన పూర్తి చేసి, నష్టపోయిన రైతుల ఖాతాల్లో డబ్బులు తిరిగి జమ చేయాలని కోరారు. కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడు కొనుగోలు కేంద్రాలకు ఒకే కలెక్షన్ ఇన్‌చార్జి ఉండటంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతి కేంద్రానికి తగిన సంఖ్యలో ఇన్‌చార్జిలను నియమించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 9,600 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతోందని, భవిష్యత్తులో మరింత విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నందున కొత్త కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు రవాణా, కొనుగోలు పరంగా ఇబ్బందులు తగ్గించేందుకు గోపాలగిరిలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆయిల్‌ఫెడ్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని నల్లు సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్షన్ ఇన్‌చార్జి కపిల్‌తో పాటు రైతులు మల్లారెడ్డి, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికారమే కాన్షీరాం ఆశయం

- బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్.

**మహబూబాబాద్, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**

బహుజన రాజకీయ పితామహుడు మాన్యవర్ కాన్షీరాం ఆశయ సాధనకు బహుజనులంతా ఐక్యంగా కృషి చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రజక సంఘం భవన్‌లో ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో కాన్షీరాం 20వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముంజాల రాజేందర్ గౌడ్ సమన్వయకర్తగా వ్యవహరించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక జనాభా కలిగిన బీసీలు రాజ్యాధికారం సాధించే దిశగా పనిచేయాలని సూచించారు. ఇతర అగ్రవర్ణ నాయకులకు ఓట్లు వేసి, వారికి పదవులు కట్టబెట్టి, తమ హక్కులు, అవసరాల కోసం బీసీలు అడుక్కునే పరిస్థితిని విడనాడాలని అన్నారు. బీసీలకు రాజకీయ అధికారం దక్కినప్పుడే నిజమైన ఆత్మగౌరవం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బహుజన సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని, ప్రలోభాలకు అమ్ముడుపోని నాయకులుగా, కార్యకర్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. బహుజన రాజ్యాధికార సాధనకు కృషి చేయడమే కాన్షీరాంకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా బాధ్యులు రాంపాక సుధాకర్ మహారాజ్, జేఏసీ కో-కన్వీనర్ గండి వీరేందర్ గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జెర్రి పోతుల వెంకన్న గౌడ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు మోత్కూరి శంకర్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నేతుల వెంకన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి జి. కుమార్, తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షుడు వొట్టెం ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు చీమల శివకుమార్, రజక సంఘం రాష్ట్ర నాయకులు నిమ్మల శ్రీను రజక, దుగ్గి గోపాల్ రజక, ముదిరాజ్ జిల్లా కార్యదర్శి పుచ్చ సోమయ్య, ఆల్ అన్సారీ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. నదీమ్ ఖాన్, ఎం.జె.ఎస్. జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి లక్ష్మీనివాస్, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మంగళంపల్లి రాజ్‌కుమార్, రాయల రమేష్, మందుల యాకన్న, విద్యార్థి నాయకుడు వారిపల్లి జంపన్న, కందిపాటి ఉపేందర్ మహారాజ్, మారపల్లి ప్రశాంత్, కెన్నర మల్లయ్య, పప్పుల శ్రీను, మొకుగూరి వెంకటేశ్వర్లు, సన్నూరి శ్రీనివాస్, స్వర్ణకారుల సంఘం నాయకుడు కొమ్ము ఎల్లయ్య తదితర కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ కంబాలపల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలి: ప్రధానోపాధ్యాయురాలు కె.గిరిజ.**

**మహబూబాబాద్, అక్టోబర్ 9(జనం వాయిస్) :**

పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ కంబాలపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కె. గిరిజ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు, ఉపాధ్యాయినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కె. గిరిజ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రకృతితో మానవ సంబంధాన్ని, మహిళల ఐక్యతను, తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెబుతుందని అన్నారు. విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాలని



సూచించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, పూల బతుకమ్మలతో ఆటపాటల్లో పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సోహన్ బీ, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి, శిభారాణి, సతీష్, సోమేశ్వర్, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, యుగేందర్, కృష్ణమూర్తి, వీరభద్రం, యాకూబ్ పాషా తదితరులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కందికొండ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు!

**కురవి, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ జిల్లా కందికొండ గ్రామ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ సార్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ తుడుసు నాగార్జున, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యుడు తోట మహేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మలను తీసుకొచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం బహుమతులు అందజేసి ప్రోత్సహించింది. గత పది రోజులుగా విద్యార్థులకు కోలాటం, నృత్యాల్లో శిక్షణ ఇచ్చిన కుమ్మరికుంట్ల భవానిని గ్రామ సర్పంచ్ తుడుసు నాగార్జున ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు రూ.1,116 నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగార్జున మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తూ, విద్యార్థులు మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు చదువుల్లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ బతుకమ్మ వేడుకలను నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



# కాన్షీరామ్ స్ఫూర్తితోనే తెలంగాణలో బహుజన రాజ్యం సాధ్యం

- బహుజనుల రాజకీయ చైతన్యానికి కాన్షీరామ్ జీవితం ఆదర్శం.
- బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్.

**మహబూబాబాద్, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా జీవితాన్ని అంకితం చేసిన మాన్యవర్ కాన్షీరామ్ స్ఫూర్తితో తెలంగాణలోనూ బహుజన రాజ్యాన్ని సాధించడం సాధ్యమేనని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఎస్పీ మహబూబాబాద్ అసెంబ్లీ యూనిట్ అధ్యక్షుడు గూగులోతు నరేష్ అధ్యక్షతన కాన్షీరామ్ 20వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దార్ల శివరాజ్ మాట్లాడుతూ.. ఉన్నత ఉద్యోగాన్ని సైతం వదులుకుని సుమారు 40 సంవత్సరాల పాటు కుటుంబానికి దూరంగా ఉంటూ, సైకిల్‌పై పర్యటించి బహుజన ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించిన గొప్ప నాయకుడు కాన్షీరామ్ అని కొనియాడారు. మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను, వారి జీవిత చరిత్రను దేశవ్యాప్తంగా బహుజన ప్రజలకు చేరవేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించాలనే లక్ష్యంతో ఉద్యమాన్ని నిర్మించిన కాన్షీరామ్, ఉత్తరప్రదేశ్‌లో మాయావతిని నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా నిలబెట్టే స్థాయికి బహుజన రాజకీయాలను తీసుకెళ్లారని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ బహుజనులంతా ఐక్యంగా ముందుకు సాగితే తెలంగాణలోనూ బహుజన రాజ్యాన్ని సాధించవచ్చని అన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు ధార ప్రసాద్ రావు, ఇసంపెల్లి ఉపేందర్, ఏవైఎస్ నాయకుడు తప్పెట్ల వీరన్న, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు బోడ లక్ష్మణ్, కేవీపీఎస్ నాయకుడు నాగెల్లి సురేష్, పిల్లి రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# కేసముద్రం 2B బార్ లైసెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

**ఇప్పటివరకు 56 దరఖాస్తులు.. అక్టోబర్ 12 చివరి గడువు**

**మహబూబాబాద్, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో 2బి బార్ లైసెన్స్ పొందేందుకు ఆసక్తి గల అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహబూబాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తెలిపారు. ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సెలవు దినాలైన అక్టోబర్ 10 (రెండో శనివారం), 11 (ఆదివారం) తేదీల్లో కూడా ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. 2బి బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబర్ 12, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఇప్పటివరకు మొత్తం 56 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెల్లడించారు.



పత్రిక ప్రకటన

ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ మహబూబాబాద్ జిల్లా

********

కేసముద్రం మున్సిపాలిటీలో 2B బార్ లైసెన్స్ దరఖాస్తుల స్వీకరణ

కేసముద్రం మున్సిపాలిటీలో 2B బార్ లైసెన్స్ పొందడానికి ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులకు తెలియజేయడమైనది ఏమనగా, గౌరవ ఎక్సైజ్ కమిషనర్ గారి ఆదేశాల మేరకు, ప్రభుత్వం సెలవు దినాలైన 10-10-2026 (రెండో శనివారం) మరియు 11-10-2026 (ఆదివారం) తేదీలలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు 2B బార్ లైసెన్స్ కు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించబడును.

చివరి తేది 12.10.2026 కాగా, ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించవలసిందిగా కోరడమైనది. ఇప్పటివరకు (56) దరఖాస్తులు స్వీకరించబడినవి.

09.10.26.
జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి
మహబూబాబాద్ జిల్లా

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

## గుండ్రాతిమడుగు జెడ్పీ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్, ఫ్రీజర్ బహూకరణ

- దాతృత్వంతో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు.
- బండి రోహిత్ రెడ్డి జ్ఞాపకార్థం అందజేత.
- మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి.

**కురవి, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన దాత బండి అనిల్ రెడ్డి--అనిత దంపతులు తమ పెద్ద కుమారుడు బండి రోహిత్ రెడ్డి జ్ఞాపకార్థం రూ.1.40 లక్షల విలువైన వాటర్ ప్యూరిఫైయర్, ఫ్రీజర్‌ను బహూకరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు శుద్ధమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు సురక్షితమైన తాగునీరు అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గత 25 ఏళ్లుగా పాఠశాల అవసరాలకు అనుగుణంగా వివిధ రూపాల్లో సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠ్యపుస్తకాలు, సైన్స్ ల్యాబ్, ఆట వస్తువులు, వెల్‌కమ్ బ్యాండ్ తదితర సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు. ఈ సౌకర్యాల కల్పనతో విద్యార్థులు పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు మండల టాపర్లుగా నిలుస్తున్నారని, గత కొన్నేళ్లుగా ఐఐటీలోనూ సీట్లు సాధిస్తున్నారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండ రాజేశ్వరి--రామకృష్ణ, మాజీ సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, గ్రామ పెద్దలు బండి సోమనరసింహారెడ్డి, బండి అనిల్ రెడ్డి, వార్డు సభ్యుడు జక్క లింగన్న, పత్తి వెంకన్న, జలగం మల్లేష్, చిక్కాల ఉపేందర్, జంగిలి శంకర్, సింగం వెంకటరమణ, ఆసోదు రాజు, పత్తి వీర నాగేశ్వరరావు, కరుణాకర్, సవలం ఉపేందర్, అబ్బగాని నరేష్, అబ్బగాని నాగేష్, రాగం వీరేష్, ప్రధానోపాధ్యాయులు జానయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు రాఘవేందర్, ఉపాధ్యాయులు జి. భద్రు, జి. యాదగిరి, ఎస్. సురేష్, ఎ. మహేశ్, బి. రమ, ఈ. శ్రీధర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మోలుగురి అఖిల ఎంపిక

### జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపిక.

**పాలకుర్తి, జనం వాయిస్ అక్టోబర్ 9:**



పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన ములుగురి వెంకన్న కుమార్తె మోలుగురి అఖిల రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైంది. గత నెల 15వ తేదీన నిర్వహించిన జనగామ జిల్లా స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో అఖిల ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ నెల 10, 11 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో అఖిల జిల్లా జట్టు తరఫున పాల్గొననుంది. తన తండ్రి ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నానని అఖిల తెలిపింది. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించేందుకు కృషి చేస్తానని పేర్కొంది. అఖిల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై చెన్నూరు గ్రామ పెద్దలు, మాజీ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పాలకుర్తి శ్రీ సోమేశ్వరుడి హుండీ ఆదాయం రూ.21,98,507

**అక్టోబర్ 9 జనం వాయిస్ పాలకుర్తి:**

పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన స్వయంభూ శ్రీ సోమే లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ 21,98,507 రూపాయలు సమకూరినట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీ ప్రసన్న తెలిపారు. 2026 మార్చి24 నుండి 2026 అక్టోబర్ 09 వరకు భక్తులు హుండీలో సమర్పించిన 100 రోజుల కానుకల ఆదాయాన్ని ఆలయం కళ్యాణ మండపంలో,, వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఈవో వెంకట్ రెడ్డి పర్యవేక్ష ణలో లెక్కించారు. మిశ్రమ బంగారం 5 గ్రాముల 580 మిల్లి గ్రాములు, మిశ్రమ వెండి1కేజీ 359.740 మిల్లి గ్రాములు, యూఎస్ డాలర్ 230, ఇంగ్లాండ్ 30 పౌండ్స్,, నేపాల్ రూపీ 150 వచ్చిన్నట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది. శ్రీసోమేశ్వర, రాజరాజేశ్వరి సేవా ట్రస్ట్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు..



# సమాచార హక్కుతోనే పారదర్శక పాలన

- ప్రజల్లో ఆర్టీఐ చట్టంపై అవగాహన పెంచాలి.
- అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్.

**మహబూబాబాద్, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**

సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెరుగుతుందని, ప్రజా భాగస్వామ్యంతో సుపరిపాలన సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్నారు. సమాచార హక్కు చట్టం--2005పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, చట్టం అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమాచార హక్కు వారోత్సవాలు--2026లో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్న నేపథ్యంలో, కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, ఇతర అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ, పౌరులు



కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందిస్తామని, విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అక్టోబర్ 5 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు వారోత్సవాల్లో భాగంగా జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారం పొందే విధానం, దరఖాస్తు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పౌరులు, పౌరసమాజ సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు.

**సమాచారం సకాలంలో అందించాలి**

ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు), సహాయ ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తమ విధులు, బాధ్యతలు, చట్టంలోని నిబంధనలు, గడువులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజలు కోరిన సమాచారాన్ని చట్ట ప్రకారం సకాలంలో అందించాలని, ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన నోటీసులు, అవగాహన పత్రాలను ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. సమాచారం కోసం కార్యాలయాలకు వచ్చే పౌరులకు దరఖాస్తు ప్రక్రియపై తగిన మార్గనిర్దేశం చేయాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంటే పాలనపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.

**మున్సిపల్ కమిషనర్‌కు ప్రశంసా పత్రం**

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1) ప్రకారం సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించినందుకు మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ బి. వినోద్ కుమార్ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ పవన్ కుమార్, జిల్లా అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్వాల వీరయ్య.

**కురవి, అక్టోబర్ 9 (జనం వాయిస్):**

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, ఏడాదికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజువారీ వేతనాన్ని రూ.800కు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్వాల వీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కురవి ఎంపీడీవో కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. ఈ సందర్భంగా అల్వాల వీరయ్య మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల పోరాటాల ద్వారా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, దాని స్థానంలో వీబీ-జీ రామ్‌జీ పథకాన్ని తీసుకురావడం వల్ల ఉపాధి హామీ లక్ష్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, ఎల్‌నినో



ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వ్యవసాయ కార్మికులకు స్థానికంగా పనులు దొరకడం లేదన్నారు. దీంతో గ్రామీణ పేదలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ ఉపాధి పనులను తక్షణమే ప్రారంభించి, వలసలను నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఏడాదికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.800 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని వీరయ్య కోరారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12,000 అందించాలని, పట్టణ ప్రాంతాల్లో 150 రోజుల ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రేషన్ కార్డుదారులకు 16 రకాల నిత్యావసర సరుకుల పంపిణీ హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కట్ల కిష్టయ్య, దుర్గ మల్లమ్మ, చంద్రయ్య, బత్తిని వీరభద్రం, గంధసిరి పద్మ, లక్ష్మి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## CEC జ్ఞానేశ్వర్ కుమార్ పదవి నుంచి తొలగించి ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరపాలి: మాజీ మంత్రి ఎర్రబెల్లి

**అక్టోబర్ 9 జనం వాయిస్ పాలకుర్తి:**




తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ తెలంగాణలో ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని,తొలగించిన అర్హులైన ఓటర్లందరి పేర్లను వెంటనే తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలని,ఓటు హక్కును కాపాడటం ఎన్నికల వ్యవస్థ బాధ్యతని,ఓట్ల తొలగింపులో నిర్లక్ష్యం లేదా అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని,జ్ఞానేశ్వర్‌ను ఆ బాధ్యత నుంచి తొలగించాలి అనే డిమాండ్‌పై సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని,ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుక ఆ గొంతుకను వినిపించే హక్కును ఎవరూ హరించకూడదని, ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కుపై ఎలాంటి అనుమానాలు తలెత్తినా వాటిని తేలికగా తీసుకోవద్దని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకుండా చూడాలని,తప్పులు జరిగితే వాటిని సరిదిద్ది, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని, నిజాలను నిగ్గు తేల్చాలని, ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం కల్పించాలని అన్నారు.

## బేతోలులో ఘనంగా గ్యార్మి షరీఫ్ వేడుకలు

... వైభవంగా 13వ కందిల్ ఉర్సు ఉత్సవాలు.
... నేడు ప్రత్యేక ప్రార్థనలు, భారీ అన్నదానం.

**మహబూబాబాద్, అక్టోబర్ 9 (జనం వాయిస్) :** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో గ్యార్మి షరీఫ్ (జెండా పండుగ) వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్థులు, ముస్లిం సోదరులు గ్యార్మి జెండాలను చేతబూని డప్పు వాయిద్యాలు, డీజే పాటల నడుమ గ్రామ పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని ఉర్సు గుట్టపై ఉన్న హజ్రత్ మహబూబ్ సుభాని దర్గాతో పాటు ఖబ్రస్తాన్‌లోని ఖాదర్ బాబా దర్గాల వద్దకు చేరుకుని జెండాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు (ఫాతిహా) నిర్వహించారు.

**వైభవంగా 13వ కందిల్ ఉర్సు ఊరేగింపు**

హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా 13వ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా కందిల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 9:30 గంటలకు స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం నుంచి 13వ చాదర్, సందల్, కందిల్ జెండాల ఊరేగింపును నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, డీజే పాటల మధ్య భక్తులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఉర్సు గుట్టకు చేరుకున్నారు. అక్కడ దర్గా వద్ద చాదర్, సందల్, కందిల్ జెండాలను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**నేడు ప్రత్యేక ప్రార్థనలు.. మొక్కుబడుల సమర్పణ**

ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉర్సు గుట్టపై ఉన్న హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ముస్లింలు, ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఫాతిహా నిర్వహించి, యాటపోతులు, కందులు సమర్పించడం ద్వారా తమ మొక్కుబడులను చెల్లించుకోనున్నారు.

**భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం**

13వ ఉర్సును పురస్కరించుకుని గౌసియా పాక్ దర్గా జెండా గద్ద వద్ద చాదర్, సందల్, కందిల్ జెండాలకు ఫాతిహా నిర్వహించిన అనంతరం, స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో భక్తులందరికీ భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో షేక్ యూసుఫ్, మస్తాన్, బాలసైదు, మైబు, మొయినుద్దీన్, మదర్, జబ్బార్ మియా, లతీఫ్, ఖాదర్ బాబా, పాషా, జావిద్, రహీం, ఇమామ్, షరీఫ్, ఖాజా, యాకుబ్ పాషా, ఇమ్రాన్‌తో పాటు గ్రామ మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు, ముజావర్లు, కందిల్ కమిటీ సభ్యులు, భక్తులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బలపాల ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

... బతుకమ్మల పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ.
... విజేతలకు బహుమతుల ప్రదానం.

**కురవి, అక్టోబర్ 9 (జనం వాయిస్):**

మహబూబాబాద్ జిల్లా బలపాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ ఇళ్ల నుంచి స్వయంగా బతుకమ్మలను తయారు చేసి తీసుకురాగా, పాఠశాల ఆధ్వర్యంలో బతుకమ్మల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీల్లో ఉత్తమ బతుకమ్మలను తయారు చేసిన ఎస్. తనుశ్రీ, ఏ. చరిత, జి. రమ్యశ్రీ, ఈ. హిమప్రియ, బి. తనుశ్రీలు వివిధ బహుమతులను గెలుచుకున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు కన్సొలేషన్ బహుమతులను విజేతలకు అందజేశారు. దారుణం స్వప్న, శాన్వి పుట్టినరోజు సందర్భంగా అందించిన బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేలుకుంట్ల సునీత చేతుల మీదుగా ప్రదానం చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా వెంకటరమణ, రామారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు మమత, జ్యోతి, వినోద్ కుమార్, రామారావుతో పాటు విద్యార్థినుల తల్లిదండ్రులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.



## సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు.. ఆస్తులపై అధికారుల ఆరా!
- ఖమ్మంలో రెండు విలాసవంతమైన భవనాల్లోనూ సోదాలు.

**మహబూబాబాద్, అక్టోబర్ 9 (జనం వాయిస్) :**



మహబూబాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న మేనేజర్ వాసంశెట్టి నరసింహారావు నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై. రమేశ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. మేనేజర్ నరసింహారావు నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన వ్యక్తులు, బంధువులు, బినామీలుగా అనుమానిస్తున్న వారి నివాసాల్లోనూ ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు చేపట్టినట్లు సమాచారం.

**ఏడు ప్రాంతాల్లో తనిఖీలు...,**

ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో మొత్తం ఏడు చోట్ల అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తూ ఆస్తులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఖమ్మంలో నరసింహారావుకు చెందినవిగా చెబుతున్న రెండు విలాసవంతమైన భవనాల్లోనూ సోదాలు కొనసాగుతున్నాయి.

**ఆస్తుల వివరాలపై ఆరా...,**

నరసింహారావుకు సంబంధించిన స్థిర, చరాస్తులు, ఇతర ఆర్థిక లావాదేవీల వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. సోదాల్లో ఇప్పటికే భారీ మొత్తంలో అక్రమ ఆస్తులు గుర్తించినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఏసీబీ అధికారుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సోదాలు పూర్తయిన అనంతరం గుర్తించిన ఆస్తుల వివరాలు, తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అధికారికంగా వెల్లడయ్యే వివరాల కోసం వేచి చూడాల్సి ఉంది.

Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPAL-LI, TELANGANA , 505184. PRGI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com